

కొడిమ్యాలలో నాయకులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రవిశంకర్



ఓటు వేసి సిరా చుక్కను చూపుతున్న యువతులు

# ఓటెత్తారు.. చైతన్యం చూపారు

- జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో ప్రశాంతంగా ఎన్నికలు
- 74.87 శాతం పోలింగ్
- ఉదయం నుంచి బారులుతీరిన ఓటర్లు
- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

జగిత్యాల, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): జిల్లాలో శాసన సభ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కాగా, పలుచోట్ల రాత్రి వరకూ కొనసాగింది. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేంద్రాల వద్ద బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. అక్కడక్కడా ఈవీఎంల మొరాయింపువంటి చిన్న చిన్న ఘటనలు మినహా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా సాగింది. జిల్లా వ్యాప్తంగా మూడు నియోజకవర్గాల పరిధిలో 74.87 పోలింగ్ శాతం నమోదైంది.

### పోలింగ్ శాతం పెరిగే అవకాశం..

జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 దాటినా తర్వాత కూడా కొన్ని చోట్ల ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో క్యూలో ఉండడంతో, కొంతమేర పోలింగ్ శాతం పెరిగే అవకాశాలున్నాయి. జిల్లాలో 6,87,952 మంది ఓటర్లుండగా, ఇందులో 3,55,629 మంది మహిళలు, 3,32,293 పురుషులు ఉన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో 73.54 శాతం, కోరుట్లలో 73.68, ధర్మపురిలో 77.5శాతం మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కోరుట్ల నియోజకవర్గంలో 262 పోలింగ్ స్టేషన్లు, జగిత్యాలలో 254, ధర్మపురి నియోజకవర్గంలో 269 స్టేషన్లు ఉన్నాయి. కోరుట్ల నియోజకవర్గంలో 2,36,726 మంది ఓటర్లున్నారు. ఇందులో మహిళలు 1,23,692 మంది ఉండగా, పురుషులు 1,13,030 ఉండగా, 73.68 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జగిత్యాలలో 2,26,635 మంది ఓటర్లుండగా, మహిళలు 1,17,315 మంది, పురుషులు 1,09,300 ఉన్నారు. వీరిలో 73.54 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ధర్మపురి నియోజకవర్గంలో 2,24,591 మంది ఓటర్లుండగా, 1,14,622 మంది మహిళలు, 1,09,963 మంది పురుషులు ఉన్నారు. వీరిలో 77.50 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో కలెక్టర్ యాస్మిన్ భాషా, అదనపు కలెక్టర్ బీఎస్ లత తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాంలో, కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో, బీజేపీ అభ్యర్థి బోగ శ్రావణి పురాణిపేట హైస్కూల్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా, జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా ముగియడానికి పోలీసులు తమ వంతు కృషి చేశారు. ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ మాన్ పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు చర్యలు చేపట్టారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను నూకపెల్లి వీఆర్‌కే కళాశాలకు భారీ బందోబస్తు మధ్య తరలించారు.

### ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాం : కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగాచ స్వేచ్ఛగా జరిగాయని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలింగ్ ప్రక్రియ పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా వెల్లడించారు. గురువారం జరిగిన పోలింగ్ సందర్భంగా జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో ఉదయం నుంచే ఓటర్లు పెద్ద ఎత్తున బారులు తీరి ఉత్సాహంగా ఓటింగ్ లో పాల్గొన్నారని తెలిపారు. మూడు నియోజకవర్గాల్లో ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు 74.87 శాతం మంది ఓటు వేశారని పేర్కొన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో 73.54 శాతం, కోరుట్ల నియోజకవర్గంలో 73.68 శాతం, ధర్మపురి నియోజకవర్గంలో 77.50 శాతం పోలింగ్ నమోదైందని తెలిపారు. జిల్లాలోని 785 పోలింగ్ కేంద్రాల్లో, జిల్లా యంత్రాంగం, పోలీసుల సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగిందని పేర్కొన్నారు. జిల్లాలో మహిళా, దివ్యాంగుల, యువతకు సంబంధించిన మోడల్ పోలింగ్ కేంద్రాలు 36 ఏర్పాటు చేశామని వివరించారు. కాగా, గురువారం ఉదయం 7 గంటలకల్లా ధరూర్ క్యాంపులోని 177 పోలింగ్ బూత్‌లో అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి వెళ్లి, మొదటగా తమ ఓటు హక్కును వినియోగించున్నామని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా వివరించారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నియోజకవర్గం వారీగా వెబ్ కాస్టింగ్ ఏర్పాటుచేసి పర్యవేక్షించామని, ఏ చిన్న లోటుపాట్లు ఉన్నా కూడా వెంటనే గుర్తించిన అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు సరి చేసిందని పేర్కొన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా వెబ్ కాస్టింగ్ కేంద్రాన్ని, మీడియా మానిటరింగ్ సెల్‌ను సందర్శించి పోలింగ్ ప్రక్రియలను కలెక్టర్ పర్యవేక్షించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజీవ్ రంజన్ మీనా, హెచ్ బసవ రాజేంద్ర, పోలీస్ పరిశీలకులు వివేకానంద సింగ్ ఎన్నికల నిర్వహణ తీరుపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షించారు. కార్యక్రమాలలో జిల్లాలోని అధికారులు, సిబ్బంది, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విజయం మనదే

- ప్రజలంతా నా వెంటే ఉన్నరు
- బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్
- పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిపై పరిశీలన

మెట్‌పల్లి, నవంబర్ 30: కోరుట్ల నుంచి తన గెలుపు తథ్యమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సంజయ్ దీమా వ్యక్తం చేశారు. గురువారం మెట్‌పల్లి పట్టణంలోని 215 పోలింగ్ బూత్‌లో తన తండ్రి, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుతో కలిసి ఓటు హక్కును వినియోగించున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉదయం నుంచే వృద్ధులు, యువకులు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారని, పనిచేసే ప్రభుత్వానికి గెలిపించుకోవాలనే సంకల్పంతో ఓటు వేసేందుకు కేంద్రాల వద్ద బారులు తీరినట్లు చెప్పారు. మంచి విద్య, వైద్యం, మంచి భవిష్యత్ కోసం మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలనే ఆకాంక్ష, తపన ఓటర్లలో కనిపించిందన్నారు. ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ ప్రశాంతంగా పోలింగ్ జరిగిందని, ఓటర్లు ఉత్సాహంగా ఓటు వేసేందుకు కదిలివచ్చారని పేర్కొన్నారు. పనిచేసే ప్రభుత్వానికే ప్రజలు పట్టం కడుతారని స్పష్టం చేశారు. అలాగే ఎస్సారెస్పీ క్యాంపులోని 213 పోలింగ్ బూత్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి డా. సంజయ్ సతీమణి దీప్తి, సోదరి సమత, కూతురు సాసా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.




సారంగాపూర్: పెంబట్లలో సెల్ఫీ పాయింట్ వద్ద సిరా చూపుతున్న యువతి



కథలాపూర్: సిరికొండ తొలిసారి ఓటు వేసిన అన్నదమ్ముళ్లు అంజిరెడ్డి, ఆది



మేడిపల్లి: వల్లంపల్లిలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళ ఓటర్లు

### ప్రశాంతంగా పోలింగ్: ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

జిల్లాలోని 927 కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. గురువారం ధర్మపురి పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, పోలింగ్ సామగ్రిని కట్టుదిట్టమైన భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తామన్నారు.

### గిరిజనగూడెం చిన్న కొల్వాయిలో 95శాతం పోలింగ్

సారంగాపూర్, నవంబర్ 30: చిన్న కొల్వాయి గిరిజన గ్రామంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 95 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. జిల్లాలోనే అతి తక్కువగా 105 ఓటర్లు ఉన్న గ్రామంగా చిన్న కొల్వాయి నిలుస్తున్నది. 105 ఓటర్లలో ఒకరు మృతి చెందగా, నలుగురు ఇతర ప్రాంతాలకు వెళ్లారు. గ్రామంలో ఉన్న వంద మందిలో వంద మంది ఓటర్లు మధ్యాహ్నం వరకు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అలాగే చిత్రవేణి గూడెం గిరిజన గ్రామంలో 394 మంది ఓటర్లు ఉండగా ఇందులో 14 మృతి చెందగా, ముగ్గురు యువతులకు వివాహాలు జరిగి వెళ్లిపోయారు. ఒకరు డబుల్ ఉండగా తొలగించారు. 367 మంది ఓటర్లు మధ్యాహ్నం 2:30 వరకు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు.



మల్యాల: పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



జిల్లా కేంద్రంలో ఓటు వేసేందుకు బారులు తీరిన పురుషులు



కోరుట్ల: నాయకులు, కార్యకర్తలతో అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల



మెట్‌పల్లి రూరల్: దివ్యాంగుడిని వీల్ చైర్‌లో తరలిస్తున్న సహాయకులు



గొల్లపల్లి: పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో బారులు తీరిన మహిళలు